ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
సోమవారం 29 సెప్టెంబరు 2025



విచారణ తర్వాతే చర్యలు



మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న సీఎం స్టాలిన్

● కరూరు దుర్ఘటనపై సీఎం స్టాలిన్ ప్రకటన

- రాజకీయ వ్యాఖ్యలు వద్దు
- బాధితులను ఆదుకోవడమే తక్షణ కర్తవ్యం

నేతల పరామర్శ... : కరూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకూ విజయ్ ప్రచార సభలో మృతి చెందినవారి కుటుంబాలను పరామర్శించేందుకు రాజకీయ నేతల, ఆయా పార్టీల స్థానిక నాయకులు క్యూకట్టారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, డిప్యూటీ సీఎం ఉదయనిధి, మాజీ ముఖ్యమంత్రి ఒ పన్నీర్‌సెల్వం, నామ్ తమిళర్ కట్చి నాయకుడు సీమాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, సీపీఎం నేత బాలకృష్ణన్, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి, ఏఎంఎంకే టీటీవీ దినకరన్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై కరూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబీబాలను, గాయాలతో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు.



కరూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గుమికూడిన జనం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరూరులో టీవీకే నేత విజయ్ ప్రచార పర్యటన సందర్భంగా జరిగిన దుర్ఘటనపై రాజకీయ పరమైన వ్యాఖ్యలు చేయదలచుకోలేదని, జస్టిస్ అరుణా జగదీష్ విచారణ తర్వాతే బాధులపై కఠిన చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. ఇప్పటికిప్పుడు బాధితులను కాపాడటం, మృతుల కుటుంబాలను ఓదార్చి, వారిని అన్ని విధాలా ఆదుకోవడమే తన కర్తవ్యంగా భావిస్తున్నానని స్టాలిన్ పేర్కొన్నారు. ఆదివారం వేకువజామున కరూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సీఎం మీడియాతో మాట్లాడుతూ ఈ దుర్ఘటనకు సంబంధించిన సమాచారం అందినప్పటి నుండి తీవ్రవమైన దిగులుచెందానని, పరిస్థితి తీవ్రంగా మారిందని తెలియగానే ఆగమేఘాలపై వచ్చానని చెప్పారు. అదే సమయంలో బాధితులకు తగు సహాయక చర్యలు చేపట్టమంటూ ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం, అన్బిల్ మహేష్, పొరుగు జిల్లాల కలెక్టర్లకు ఆదేశించానన్నారు.

విజయ్ చర్యలు గర్హనీయం .. : కరూరు ప్రచార సభలో తనకోసం వచ్చి ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను పరామర్శించకుండా టీవీకే నేత విజయ్ ఎలా ఇంటి తిరిగి వెళ్ళారో తనకు అర్థం కావటం లేదని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ అన్నారు. విజయ్ ఇలా బాధ్యతారహితంగా నడచుకోవడం గర్హనీయమని, ఆయన రాజకీయాలుకు కొత్త అని, ఆ పార్టీలో అనుభవం కలిగిన నాయకులంటూ ఎవరూ లేరని, ఈ విషయాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. సినిమా షూటింగ్‌ల తరహాలో పార్టీ సభలను నడుపలేమన్న విషయాన్ని విజయ్ తెలుసుకోవాలని, రాజకీయాల్లో ఎల్లప్పుడూ ప్రజలకు అండగానే నిలబడాలని హితవు పలికారు.



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు నయినార్‌నాగేంద్రన్, పొన్‌రాధాకృష్ణన్, వానతి శ్రీనివాసన్

విజయ్ సభకు పటిష్ఠమైన భద్రత కల్పించాం!

● ఇన్‌ఛార్జ్ డీజీపీ వెంకట్రామన్

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరూరులో టీవీకే నేత విజయ్ ప్రచార సభకు పటిష్ఠమైన భద్రత కల్పించినట్లు ఇన్‌ఛార్జి డీజీపీ వెంకట్రామన్ పేర్కొన్నారు. టీవీకే నేతలు ఆ సభకు పదివేలమంది హాజరవుతారని పోలీసుల అనుమతి తీసుకున్నారని, ఆ మేరకు ఓ ఎస్పీ, ఇద్దరు ఏఎస్పీలు, నలుగురు డీఎస్పీలు, 17 మంది సీఐలు, 350 మంది కానిస్టేబుళ్లు విజయ్ ప్రచారం చేసిన ప్రాంతంలో బందోబస్తులో ఉన్నారని తెలిపారు. ఇక విజయ్ ప్రచారం చేసిన ప్రాంతానికి రెండు వైపుల వాహనాలను వెళ్ళకుండా అడ్డుకోవడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు మరో 150 మంది కానిస్టేబుళ్లను నియమించినట్టు చెప్పారు. టీవీకే నేతలు చెప్పినట్లు పదివేలకంటే ఎక్కువగా జనం వచ్చారని, వీరంతా శనివారం ఉదయం 11 గంటల నుండే విజయ రాకకోసం ఎదురు చూడగా, రాత్రి 7.10 గంటలకు విజయ్ రావటం వల్ల అలసిపోయిన జనమంతా సొమ్మసిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. పార్టీ నిర్వాహకులు సభకు వచ్చిన జనాలకు కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదన్నారు.

బుస్సీ ఆనంద్ సహా నలుగురిపై కేసు



బుస్సీ ఆనంద్, నిర్మల్‌కుమార్, మదిఅళగన్

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 40 మంది మృతిచెందిన కేసులో టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ సహా నలుగురిపై పోలీసులు 5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వీటిలో నాన్ బెయిలబుల్ సెక్షన్ కూడా ఉన్నందున వీరిని ఏ నిమిషంలోనైనా పోలీసులు అరెస్ట్ చేసే అవకాశముంది. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని విజయ్ ఈ నెల 13న తిరుచ్చి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పోలీసుల అనుమతి మేరకు రెండు విడతల ప్రచారాన్ని పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో, శనివారం తన మూడో విడత ప్రచారాన్ని నామక్కల్, కరూర్ ప్రాంతాల్లో చేపట్టగా, చిన్నారుల నుంచి మహిళలు, వృద్ధులు, యువత, అభిమానులు కనీవినీ ఎరుగని రీతిలో హాజరైయ్యారు. కరూర్‌లో రాత్రి విజయ్ ప్రచారంలో ఊహించని విధంగా జరిగిన తొక్కిసలాటలో వంద మందికి పైగా చిక్కుకున్నారు. వీరిలో చిన్నారులు, మహిళలు, పురుషులు కలిపి 40 మంది మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ విషాదమైన ఘటనకు సంబంధించి కరూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విజయ్ పర్యటనకు సారథ్యం వహిస్తున్న బుస్సీ ఆనంద్, టీవీకే సంయుక్త కార్యదర్శి నిర్మల్ కుమార్, పార్టీ కరూర్ జిల్లా కార్యదర్శి మదియళగన్‌తో పాటు మరొకరిపై హత్యాయత్నం, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘన, మనిషిప్రాణాలకు ప్రమాదం కలిగించడం, ప్రజా ఆస్తుల ధ్వంసం తదితర ఐదు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇందులో ఏ1 ముద్దాయిగా మదియళగన్, ఏ2గా బుస్సీ ఆనంద్, ఏ3గా నిర్మల్‌కుమార్‌ను చేర్చారు. మరోవైపు టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను కూడా ఈ కేసు విచారణ సమయంలో ముద్దాయిగా చేర్చే అవకాశమున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

34 మంది మృతులను గుర్తించిన పోలీసులు



దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారు

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరూరులో టీవీకే నేత విజయ్ ప్రచార సభ ప్రాంతంలో మృతి చెందిన 40 మందిలో 34 మందిని పోలీసులు గుర్తించి వారి పేర్లను, తల్లిదండుల వివరాలను కూడా వెల్లడించారు. మృతి చెందినవారిలో తామరైకన్నన్ (25), హేమలత (8), సాయి లక్షణ (8), సాయి జీవా (4), సుకన్య (33), ఆకాష్ (23), ధనుష్‌కుమార్ (24), వడివేల్ (54), రేవతి (52), చంద్రా (40), గురు విష్ణు (2), రమేష్ (32), సంజు (13), రవికృష్ణన్ (32), ప్రియదర్శిని (35), ధరణిక (14), పళనియమ్మాళ్ (11), కోకిల (14), మహేశ్వరి (45), అజితా (21), మాలతి (36), సుమతి (50),మణికంఠన్ (33), సతీష్‌కుమార్ (34), కృత్తికాయాదవ్ (7), ఆనంద్ (26), శంకర్‌గణేష్ (45), విజయరాణి (42), గోకుల ప్రియా (28), ఫాతిమా భాను (29), కిషోర్ (17), జయా (55), అరుకాణి (60), జయంతి (43) అనే వారు మృతి చెందినట్లు ప్రకటించారు.

తాగేందుకు నీళ్లు లేవు... భద్రతా ఏర్పాట్లు లేవు...!

తొక్కిసలాటకు కారణాలివేనా ?



కుటుబ సభ్యులు,బంధువుల రోదన

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరూరు సభలో తొక్కిసలాట జరగటానికి విజయ్ రాకకోసం గంటల తరబడి వేచి ఉన్న వేలాదిమంది జనానికి తాగేందుకు నీళ్లు లేకపోవడం, తగిన పోలీసు భద్రత కల్పించకపోవటమే ప్రధాన కారణాలని స్థానికులు చెబుతున్నారు. ముందు రోజు అదే ప్రాంతంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) రోడ్‌షోకు కూడా వేలాదిమంది హాజరయ్యారని, పార్టీ నిర్వాహకులు వారికి వాటర్ బాటిల్స్ అందించారని, అలాంటి ఏర్పాట్లు టీవీకే నేతలు కల్పించలేదని ఆరోపించారు. కరూర్ సభకు విజయ్ రాకముందే, వేలుచామిపురంలో విద్యుత్ సరఫరా నిలిపేశారు. రద్దీలో చిక్కుకోకుండా పలువురు యువకులు సమీపంలోని చెట్లు, భవనాలపై ఎక్కారు. దీని కారణంగా, ఆ ప్రాంతాల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలకు వారు చిక్కుకోకుండా ముందుగానే విద్యుత్ నిలిపివేసినట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. అదే సమయంలో, విజయ్ ప్రసంగం ప్రారంభించడంతో, రద్దీ అధికమై తోపులాట జరిగి, ఒకరిపై ఒకరు పడిపోయారు. రద్దీ అధికంగా ఉండడంతో కిందపడిన వారి సకాలంలో రక్షించడంలో కూడా జాప్యం చోటుచేసుకుంది.



మార్చురీ వద్ద కూర్చున్న మృతుల కుటుంబీకులు



మహిళను వీల్ చెయిర్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

వాటర్ బాటిల్స్ విసిరేయడం భావ్యమేనా?

కరూర్ సభలో విజయ్ ప్రసంగం ప్రారంభించే సమయంలో వాహనం చుట్టూ ఉన్న కార్యకర్తలు తోపులాటకు గురయ్యారు. వారిలో కొందరు స్పృహతప్పారు. విజయ్ వెంటనే, వారికి నీరు అందించాలని చెబుతూ... తన వాహనంలో ఉన్న వాటర్ బాటిల్స్ విసిరేశాడు. అనంతరం గుంపులో పలువురు 'నీళ్లు కావాలి' అంటూ బిగ్గరగా కేకలు వేయడంతో, విజయ పక్కనే నిలబడి ఉన్న ఆధవ్ అర్జున, విజయ్ బాడీగార్డులు ఒక్కొక్కటిగా వాటర్ బాటిల్స్ జనం మధ్యలోకి విసిరేశారు. ఒక వైపు కరెంటు లేకపోవడంతో, విసిరేసిన వాటర్ బాటిల్స్ అందుకునేందుకు, కింద పడిన బాటిల్స్ అందుకునేందుకు యత్నించగా, ఒకరిపై ఒకరు పడడం, కింద పడిన వారిపై పలువురు ఎక్కడంతో భారీ ప్రాణనష్టం జరిగిందని కూడా స్థానికులు కొందరు చెబుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల వైద్య ఖర్చులు భర్తిస్తాం...

కరూర్ సభలో తొక్కిసలాటకు గురైన పలువురిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన... చికిత్స పొందుతున్న వారి నుంచి ఎలాంటి ఫీజు తీసుకోవద్దని, వాటిని తాము అందజేస్తామని ఆయా ఆస్పత్రుల యాజమాన్యానికి తెలిపారు.

ఇతర ప్రాంతాల నుంచి వైద్యులు...

టీవీకే నేత విజయ్ ప్రచార సభలో చోటచేసుకున్న తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కరూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరినవారికి తక్షణ వైద్యం అంచడానికి వీలుగా సేలం నుంచి 30 మంది వైద్యులు, నామక్కల్ నుంచి 9 మంది, మదురై నుంచి 49 మంది, దిండుగల్ నుంచి 22 మంది, పుదుకోట నుంచి ముగ్గురు, కోవై నుంచి ఏడుగురు, తిరుచ్చి నుంచి 25 మంది ఇలా 145 మంది వైద్యులతో పాటు కరూర్‌కు చెందిన 200 మంది మొత్తం 345 మంది వైద్యులు బాధితులకు చికిత్స అందిస్తున్నారు. కరూర్ జిల్లా కలెక్టర్‌తో పాటు తిరుచ్చి, దిండుగల్ జిల్లాల కలెక్టర్లు కూడా చికిత్స సహాయక చర్యలు అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.





తొక్కిసలాట ప్రాంతంలో చెల్లాచెదురుగా పడివున్న పాదరక్షలు - ఆస్పత్రి ప్రాంగణం వద్ద పోలీసుల బారికేడ్ల ముందు మహిళలు

ప్రశాంతంగా గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షలు

- డిసెంబరులో ఫలితాలు
- టీఎన్‌పీఎస్సీ అధ్యక్షుడు ఎస్కే ప్రభాకర్



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రభాకర్

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలు డిసెంబరులో విడుదల చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ అధ్యక్షుడు ఎస్కే ప్రభాకర్ తెలిపారు. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌సీఎస్సీ) ఆధ్వర్యంలో 645 గ్రూప్-2, 2ఏ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం జరిగాయి. ఈ పరీక్షలకు 5,53,634 మంది హాజరయ్యారు. చెట్‌పెట్‌లోని ప్రిసిడెన్సీ హార్వర్డ్‌హాల్ సీనియర్ సెకండరీ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని టీఎన్‌పీఎస్సీ అధ్యక్షుడు ప్రభాకరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఏడాదికి సంబంధించిన పరీక్షల టైం టేబుల్ విడుదల చేసి ఆ ప్రకారం, నిర్ణీత కాలంలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది అక్టోబరులో విడుదల చేసిన టైం టేబుల్ ప్రకారం, ఈ ఏడాది ఏడు పరీక్షలు నిర్వహించాలని ప్రకటించగా, ప్రస్తుతం 6వ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 7వ పరీక్షకు సంబంధించిన ప్రకటన త్వరలో వెల్లడించనున్నామని తెలిపారు. పరీక్షలు నిర్వహించి ఇదివరకే ప్రకటించిన తేదిన ఫలితాలు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్వహించిన గ్రూప్-2,2ఏ ఫలితాలు డిసెంబరులో విడుదల చేయనున్నామని తెలిపారు. అనంతరం మెయిన్స్ వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్నామన్నారు. గ్రూప్-4 ఫలితాలు అక్టోబరు నాలుగో వారంలో విడుదల చేయనున్నామని టీఎన్‌పీఎస్సీ అధ్యక్షులు ప్రభాకర్ తెలిపారు.

కమిషన్ విచారణలో వాస్తవాలు వెల్లడి



గాయపడినవారిని పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి

- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరూరు దుర్ఘటనకు సంబంధించి జస్టిస్ అరుణా జగదీశన్ విచారణ కమిషన్ విచారణ తర్వాతే వాస్తవాలు వెలుగుచూస్తాయని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. కరూర్‌లో శనివారం జరిగిన టీవీకే నేత విజయ్ సభలో జరిగిన తొక్కిసలాటలో పలువురు మృతి చెందినట్లు తెలియగానే ఉదయనిధి ఆగమేఘాలపై చెన్నై నుంచి విమానంలో తిరుచ్చి చేరుకుని అక్కడి నుండి కారులో కరూరు వెళ్ళారు. ఆదివారం ఉదయం కరూర్ ఆస్పత్రికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కరూర్ జరిగిన దుర్ఘటన మనోవేదన కలిగించిందన్నారు. వీరి మృతితో ఆ కుటుంబాలకు ఏర్పడిన లోటు ఎవ్వరూ తీర్చలేరన్నారు. ఘటనలో గాయపడిన చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఘటనపై విచారణకు మాజీ న్యాయమూర్తి అరుణా జగదీష్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్‌ను సీఎం స్టాలిన్ నియమించారని, కమిషన్ విచారణలో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశముందన్నారు. భద్రతా ఏర్పాట్లు లోపించాయని ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి ఆరోపిస్తున్నారని, రెండు రోజుల క్రితం ఆయన అదే ప్రాంతంలో ప్రచారం చేశారని గుర్తు చేశారు. సభకు ఎంతమంది వచ్చారు, కల్పించిన భద్రతా ఏర్పాట్లను శనివారం డీజీపీ వివరించారన్నారు. ఇలాంటి సమయంలో తాను రాజకీయాలు మాట్లాడేందుకు ఇష్టపడడం లేదన్నారు. ప్రతి రాజకీయ పార్టీ నేత ప్రజలను కలుసుకోవడం వారి హక్కని, దానిని ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. రద్దీని నియంత్రించడం టీవీకే కర్తవ్యమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని సూచించారు.. ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటారని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఆయా ప్రాంతాల వివరాలు.. రామాపురం పరిధిలోని టీవీ నగర్, కృష్ణవేణి నగర్, లలితాంబాళ్ నగర్, శ్రీలక్ష్మి నగర్, కార్తీక్ బాలాజి నగర్, శబరి నగర్, డీఎల్ఎఫ్, గుప్తా కంపెనీ, మౌంట్ పూందమల్లి మెయిన్ రోడ్డు, కమల నగర్, శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర అవెన్యూ, శుభశ్రీ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ బోర్డు తెలిపింది.

5,6 తేదీల్లో ఇళ్ల వద్దకే రేషన్

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పురస్కరించుకుని, అక్టోబరు నెలకు సంబంధించి అక్టోబరు 5,6 తేదీల్లో సీనియర్ సిటిజన్ల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించనున్నట్టు సహకార శాఖ తెలిపింది. ఈ మేరకు సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్లకు సహకార సంఘాల రిజిస్ట్రార్ నంద కుమార్ జారీచేసిన సర్క్యులర్‌లో.. రాష్ట్రంలో రేషన్ కార్డులు కలిగిన 70 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. అక్టోబరు 20వ తేది దీపావళి పండుగ దృష్ట్యా, ముందుగానే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు రేషన్ సరుకులు అందించాలని నిర్ణయించినట్లు, అక్టోబరు 5,6 తేదీల్లో వారి ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని ఉత్తర్వులో తెలిపారు.

మరో 727 పెరిగిన గ్రూప్-4 ఉద్యోగాలు

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ద్వారా భర్తీ చేయనున్న గ్రూప్-4 పోస్టుల్లో అదనంగా 727 పోస్టులు చేర్చారు. కౌన్సెలింగ్‌కు ముందు ఈ పోస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. గ్రూప్-4 విభాగంలో ఖాళీగా ఉన్న 3,935 పోస్టుల భర్తీకి జూన్ 12వ తేది రాత పరీక్ష నిర్వహించగా, 11,48,019 మంది హాజరయ్యారు. దాని ఫలితాలు మూడు నెలల్లో విడుదల చేస్తామని టీఎన్‌పీఎస్సీ ప్రకటించగా, జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతోంది. ఈ క్రమంలో, ప్రస్తుతం ఉన్న పోస్టులకు అదనంగా 727 పోస్టులు భర్తీ చేయ నున్నారు. ఫలితాలు వెలువడి, కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే సమయానికి భర్తీ చేయనున్న పోస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని టీఎన్‌పీఎస్సీ అధికారులు తెలిపారు.

6 నుంచి ఎంబీబీఎస్ మూడో విడత కౌన్సెలింగ్

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల మూడో విడత కౌన్సెలింగ్ అక్టోబరు 6 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రభుత్వ, మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్‌ను డీఎంఈ చేపడుతోంది. ఆ ప్రకారం, రెండు విడతల కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, ఖాళీ సీట్లు, విద్యార్థులు మరో కాలేజీలో చేరితే ఏర్పడిన ఖాళీ సీట్లు, అదనంగా కేటాయించిన సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్ అక్టోబరు 6వ తేది నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. ఈ కౌన్సెలింగ్ కొత్తగా చేరే విద్యార్థులు, ఇతర కళాశాలల్లో సీటు కావాలనుకునే విద్యార్థులకు ఇది చివరి, కీలకమైన అవకాశం. కాగా, ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అధికంగా వసూలుచేసే ప్రైవేటు కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది.

జీఎస్టీ శ్లాబు తగ్గింపుపై విద్యార్థులకు పోటీలు

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ శ్లాబు తగ్గింపుతో ప్రజలక లబ్ధి చేకూర్చే అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. అందుకోసం www.peoplefriendlygst.com అనే వెబ్‌సైట్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.... జీఎస్టీ సంస్కరణ ప్రయోజనాల గురించి విద్యార్థులకు, సాధారణ ప్రజలకు తెలియజేసేలా అక్టోబరు నెలాఖరు వరకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

1 నుంచి ఎక్స్‌ప్రెస్ పోస్ట్ మాత్రమే - తపాలా శాఖ

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ అందిస్తున్న రిజిస్టర్ పోస్ట్ సేవలు నిలిపివేసి, ఎక్స్‌ప్రెస్ పోస్ట్‌తో విలీనం చేశారు. ఈ ప్రక్రియ అక్టోబరు 1వ తేది నుంచి అమలుకు రానున్న నేపథ్యంలో, ఎక్స్‌ప్రెస్ పోస్టు ఫీజులు సవరించారు. దస్తావేజులకు గరిష్ట రుసుము స్థానికంగా 50 గ్రాములకు రూ.19, 200 కి.మీ వరకు రూ.47, 201 నుంచి 2,000 కి.మీ వరకు రూ.47గా సవరించారు. అలాగే, 51 గ్రాముల నుంచి 250 గ్రాముల వరకు స్థానికంగా రూ.24, 200 కి.మీ వరకు రూ.59, 201 నుంచి 500 కి.మీ వరకు రూ.63, 501 నుంచి 1,000 కి.మీ వరకు రూ.68, 1,001 కి.మీ నుంచి 2,000 కి.మీ వరకు రూ.72, 2,000 కి.మీకు పైన రూ.77గా వసూలుచేయనున్నారు. అదే విధంగా 251 నుంచి 500 గ్రాముల వరకు స్థానికంగా రూ.28, 200 కి.మీలోపు రూ.70, 201 నుంచి 500 కి.మీ వరకు రూ.75, 501 నుంచి 1,000 కి.మీ వరకు రూ.82, 1,001 నుంచి 2,000 కి.మీ వరకు రూ.86, 2,000 కిమీ పైగా రూ.93 రుసుముగా సవరించారు. యజమాని లేదా అతను నియమించిన వ్యక్తికి మెయిల్ డెలివరీ చేయబడితే, సంబంధిత వ్యక్తి ఇంట్లో లేకున్నా, మెయిల్ స్వీకరించేందుకు ఎవరూ లేని పక్షంలో, ఓటీపీ స్వీకరించడం ద్వారా మెయిల్ స్వీకరించేందుకు రూ.5 అదనపు రుసుము వసూలు చేయనున్నారు. సవరించిన రుసుము అక్టోబరు 1వ తేది నుంచి అమలుకు వస్తుందని తమిళనాడు తపాలా రీజియన్ ఒక ప్రకటనలో తెలిపింది.

చెన్నై-రామేశ్వరం మధ్య వందే భారత్ సేవలు

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై-రామేశ్వరం మధ్య వందే భారత్ రైలు సేవలు ప్రారంభించాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. రామనాథపురం-రామేశ్వరం మధ్య 53 కి.మీ రైల్వే లైన్ విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో, చెన్నై-రామేశ్వరం మధ్య వందే భారత్ రైళ్ల సేవలు ప్రారంభించనున్నారు. ఎగ్మూర్ లేదా తాంబరం నుంచి ఈ రైలు ప్రారంభించాలని రైల్వే బోర్డుకు దక్షిణ రైల్వే సిఫారసు చేసింది. ఈ మార్గంలో పగటి పూట రైలు సేవలు అందుబాటులో లేవు. రాత్రి వేళల్లో సేతు సూపర్‌ఫాస్ట్, బోట్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ సహా మూడు ఎక్స్‌ప్రెస్‌లు,, నాలుగు వారాంతపు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గంలో వందే భారత్ సేవలు ప్రారంభిస్తే ప్రయాణికుల రద్దీ తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు.





నత్తనడకన తిరుముల్లైవాసల్ వంతెన నిర్మాణం

● 18 యేళ్లుగా కొనసాగుతున్న పనులు



టి.నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీపంలోని తిరుముల్లైవాసల్ పంచాయతీ పరిధిలో ఉప్పనారు నదిపై రాష్ట్ర రహదారుల శాఖ 2007లో రూ.30 కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ వంతెన తిరుముల్లైవాసల్ - కీళ్‌మూవర్‌కరై ప్రాంతాలను కలిపే విధంగా కిలో మీటర్ పొడవున చేపట్టిన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి.. ఉప్పనారు నదిపై వంతెన దాదాపు పూర్తికావచ్చినా ఓ వైపు అనుసంధాన రహదారి నిర్మాణం జరుగలేదు. ఇలా 18 యేళ్లపాటు ఈ వంతెన నిర్మాణం కొనసాగుతుండటంపై స్థానిక ప్రజలు ప్రత్యేకించి జాలర్లు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుముల్లైవాసల ప్రాంతం చుట్టూ తొడువాయ్, కూళైయార్, మడవామేడు, కొట్టాయ్‌మేడు, ఓలకొట్టాయ్ మేడు, తండాంకుళం, పళయపాళయం, తర్గాస్, పుదుపట్టిణం సహా పదికిపైగా మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ ప్రాంతాలకు చెందిన జాలర్లు నాగై, కారైక్కాల్ రేవులకు మత్స్య సంపద సరఫరా చేయడానికి సీర్గాళి మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. దీని వల్ల వారికి అదనపు సమయం, డబ్బు వృధా అవుతున్నాయి. ఈ విషయమై స్థానిక మత్స్యకారులు మాట్లాడుతూ ఉప్పనారుపై వంతెన నిర్మాణం 18 యేళ్లుగా నత్తనడకన చేస్తూ కొత్త రికార్డు నెలకొల్పారని ఆరోపించారు. ఈ వంతెనను నిర్మించకముందు పడవలు, దోనెలపై అవతలి ఒడ్డుకు వెళ్ళి వచ్చేవారమని, ప్రస్తుతం వంతెన కారణంగా వెళ్ళలేక పోతున్నామని చెప్పారు. వంతెన నిర్మాణం పూర్తయినా, దానికి ఇరువైపులా రోడ్డు నిర్మించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం నుండి పూంపుహార్ వెళ్ళాలంటే వసపుత్తూరుకు సీర్గాళికి వెళ్ళాల్సి ఉందని, ఈ వంతెన నిర్మాణం పూర్తయితే నేరుగా పూంపుహార్‌కు సులువుగా చేరుకోగలమని చెప్పారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఈ విషయమై సీర్గాళి అసిస్టెంట్ ప్లాంట్ ఇంజనీర్ ఇలంపిరై మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణం 2009లో ప్రారంభమైనా, ప్రాజెక్టు వ్యయం అంచనా కంటే తక్కువగా ఉందన్న కారణంగా 2014లో నిర్మాణ పనులు ఆగిపోయాయని, ఆ తర్వాత ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించిన తర్వాత పనులు ప్రారంభమయ్యాయని, రెండు మాసాలలోపున వంతెన నిర్మాణాన్ని తప్పకుండా పూర్తిచేసి ప్రారంభిస్తామని ప్రకటించారు.

కరూర్ ఘటనతో ఈపీఎస్ ప్రచారం వాయిదా

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో 39 మంది మృతిచెందిన నేపథ్యంలో, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్) ఆదివారం చేపట్టాల్సిన ప్రచారాన్ని వాయిదా వేశారు. వచ్చే ఏడాది ఎన్నికల దృష్ట్యా ఈపీఎస్ మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంలో గత మూడు నెలలుగా పలు జిల్లాల మీదుగా పర్యటించారు. ముందే వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 28వ తేదీ ఆదివారం ధర్మపురి జిల్లాలోని ధర్మపురి, పాపిరెడ్డిపట్టి, కరూర్ నియోజకవర్గాల్లో నిర్వహించాల్సిన పర్యటన సోమవారానికి వాయిదా పడింది. అంతేకాకుండా కరూర్ మృతులకు సంతాప సూచికంగా ఆదివారం అన్నాడీఎంకే తరుపున అన్ని కార్యక్రమాలను రద్దు చేశారు.

అన్బుమణి కరూర్ పర్యటన రద్దు

తమిళ ప్రజల హక్కుల పరిరక్షణ పేరుతో పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి చేపట్టిన ప్రచార పర్యటన ఇప్పటివరకు 20కి పైగా నియోజకవర్గాల మీదుగా సాగింది. ముందే ప్రకటించిన దాని ప్రకారం ఆదివారం కరూర్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు అన్బుమణి ప్రకటించారు. కరూర్ మృతుల కుటుంబాలకు నష్టపరిహారం పెంచాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని అన్బుమణి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుక్క కరిస్తే '1913'కి సమాచారం ఇవ్వండి : జీసీసీ

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురైన వారి వివరాలను '1913' అనే నెంబరుకు తెలియజేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విజ్ఞప్తి చేసింది. ఈ విషమయై జీసీసీ అధికారులు మాట్లాడుతూ... నగరంలో ప్రతి ఏడాది 10 నుంచి 20 శాతం వరకు కుక్కల పెరుగుదల ఉంటుందన్నారు. వాటిని నియంత్రించేలా వీధి కుక్కలకు కు.ని శస్త్రచికిత్స, వ్యాధులు రాకుండా టీకాలు వేస్తున్నామన్నారు. కానీ, కుక్క కాటుకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందే వారి వివరాలను బాధితులు, ఆయా ఆస్పత్రులు కార్పొరేషన్‌కు సమాచారం ఇవ్వడం లేదన్నారు. రేబిస్ నిరోధించే చర్యల్లో భాగంగా, కుక్క కాటుకు గురైన వ్యక్తి వివరాలు, ఏ ప్రాంతంలో కరిచింది అనే వివరాలను ప్రజలు '1913' నెంబరుకు తెలియజేయాలని, తమ ఆస్పత్రుల్లో కుక్క కాటుకు గురైన చికిత్స పొందుతున్న వారి వివరాలకు ఆయా ఆసుపత్రుల నిర్వాహకులు జీసీసీకి సమాచారం అందించాలని జీసీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

అక్టోబర్‌లో 20.02 టీఎంసీల జలాలు

● కావేరి నిర్వాహక మండలి ఆదేశం

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అక్టోబర్‌లో 20.02 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయాలని కర్ణాటక రాష్ట్రానికి కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వులు జారీచేసింది. న్యూఢిల్లీలో మిషన్ ఛైర్మెన్ ఎస్‌కే. హల్దార్ సారథ్యంలో జరిగిన 44వ కావేరి మండలి సమావేశంలో తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు చెందిన నీటిపారుదలశాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా అక్కడున్న జలాశయాలు పూర్తిస్థాయిలో నిండాయని, అందువల్ల రాష్ట్రానికి అక్టోబర్ నెలకు రావాల్సిన 20.02 టీఎంసీల జలాలను విడుదల చేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వానికి మండలి ఉత్తర్వులు జారీచేసింది.

లక్ష్మీనారాయణుడిగా కొల్లాపురియమ్మన్



తిరుత్తణి, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కొలువుదీరిన కొల్లాపురియమ్మన్ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనారాయణుల అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీనారాయణ అలంకారం, దీపారాధన నిర్వహించారు. చివరగా భక్తులందరికి ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జయకృష్ణన్, దివాకర్, భరత్, నాగేంద్ర శెట్టి, గోపి, వంశీ, చరణ్, శ్రావణ్‌కుమార్, రాజేష్, శేష, యువరాజ్ ప్రదీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహారాణిగా కన్యకా పరమేశ్వరి



ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్వాల్ బజార్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారిని రోజుకో అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం వృషభవాహనంపై అన్నపూర్ణ అలంకారంలో పూజలందుకున్న అమ్మవారు ఆదివారం గజ వాహనంపై మహారాణి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. లలిత మనోహరి, మనోరంజని గ్రూప్‌ల భక్తిగీతాలు, కలైమామని తిరువారూర్ వైద్యనాథన్ బృందం సంగీత కచేరి శ్రోతలను అలరించాయి. ఎస్‌కేపీడీ ట్రస్టీల ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

● వరుస సెలవుల ఎఫెక్ట్ ...

విక్రవాండి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ



ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): త్రైమాసిక పరీక్షల సెలవులు, ఆయుధపూజ వరుస సెలవులు రావడంతో రాజధాని నగరం నుంచి బస్సులు, సొంత వాహనాల్లో పెద్దసంఖ్యలో కుటుంబాలు సొంతూళ్లకు పయనమవుతున్నాయి. దీంతో తాంబరం, విల్లుపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు, షోళింగనల్లూరు, కారనుడై తదితర ప్రాంతాల్లోని టోల్‌ప్లాజాల వద్ద శనివారం రాత్రి నుంచే వాహనాల రద్దీ పెరిగింది. చెన్నై-మదురై జాతీయ రహదారిలోని చెంగల్పట్టు, విల్లుపురం ప్రాంతాల్లో ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇరువైపులా వందల సంఖ్యలో వాహనాలు బారులుతీరడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. విక్రవాండిలో ఉన్న టోల్‌ప్లాజాలో పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనాలు సులువుగా, త్వరగా వెళ్లేలా శనివారం సాయంత్రం నుంచే అదనంగా రెండు గేట్లు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 11గేట్లలో వాహనాలను అనుమతిస్తున్నప్పటికీ కనీసం అర్ధగంట అయినా వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. అర్ధరాత్రి 12 వరకు సుమారు 40వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించినట్లు టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు నిర్మాణంతో గ్రూప్-2 అభ్యర్థుల అవస్థలు





నూతన రోడ్డు నిర్మాణం దృశ్యం - పరీక్షా కేంద్రం బయట నిలుచున్న గ్రూప్-2 అభ్యర్థులు

తిరుత్తణి, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పరీక్షకు హాజరుకాని కారణంతో గ్రూప్-2 అభ్యర్థులను పరీక్ష రాసేందుకు అధికారులు నిరాకరించారు. వివరాల్లోకి వెళ్తే తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వెళ్లిన కొంతమంది అభ్యర్థులను కొత్తగా నిర్మించిన ఆ రోడ్డు దాటేందుకు అధికారులు నిరాకరించారు. దీంతో పరీక్ష సమయానికి హాజరుకాలేక చాలా సేపు అభ్యర్థులు అక్కడనే నిలుచుని అనుమతి కోసం వేచిచూశారు. ఎంతసేపైనా అనుమతించకపోయే సరికి అభ్యర్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు అధికారులతో మాట్లాడి రోడ్డు దాటేందుకు ఒప్పించారు. వెంటనే పరీక్షా కేంద్రానికి వెళ్లిన అభ్యర్థులను 10 నిమిషాలు ఆలస్యమైందనే కారణంతో కళాశాల యాజమాన్యం లోపలికి అనుమతించలేదు.

కరూర్ మృతులకు కాంగ్రెస్ రూ.కోటి సాయం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై



ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కరూర్ మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థికసాయం అందజేయనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటించారు. తమళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో పెరిగిన రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగింది. ఈ విషాద ఘటనలో 39 మంది మృత్యువాత పడగా, 50 మందికి పైగా గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలను, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సెల్వపెరుంతగై ఆదివారం ఉదయం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కరూర్‌లో జరిగిన విషాద ఘటన మరెక్కడా జరగకుండా రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు టీఎన్‌సీసీ తరుపున రూ.కోటి ఆర్థికసాయాన్ని తమ పార్టీ పార్లమెంట్ సభ్యుల ద్వారా అందజేస్తామని, రెండో విడతగా ఈ సహాయాన్ని పెంచి ఇచ్చేందుకు కరూర్ పార్లమెంట్ సభ్యురాలు జ్యోతిమణితో చర్చించి ప్రకటిస్తామన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జరగాల్సిన కార్యక్రమాలను ఆదివారం నుండి మంగళవారం వరకు రద్దుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు హత్యకేసులో దంపతులు సహా ముగ్గురికి జీవిత ఖైదు

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల కారణంగా రైతును హత్యచేసిన కేసులో, తల్లీ తండ్రి కుమరుడికి జీవిత ఖైదు విధిస్తూ తిరుచ్చి కోర్టు తీర్పు వెలువరించింది. తిరుచ్చి జిల్లా ముసిరి తాలూకా పాలప్పాడి ప్రాంతానికి చెందిన పళనిస్వామి (44)కి ఎకరా భూమి ఉంది. దాని పక్కనే పళనిస్వామి, అతని పినతండ్రి అమ్మాచ్చికి చెందిన వ్యవసాయ బావి ఉంది. బావి సమీపంలో అమ్మాచ్చికి చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన ఉత్తండన్ (76) 17ఏళ్లక్రితం కొనుగోలుచేశాడు.ఈ క్రమంలో, బావి శిధిలావస్థకు చేరుకుంది. ఈ కారణంగా బావి తవ్వి నీటిని ఇద్దరం కలసి పంచుకుందామని పళనిస్వామి ఉత్తందన్‌ను కోరగా, తమ వద్ద డబ్బు లేదని ఉత్తందన్ చెప్పాడు. అనంతరం, పళనిస్వామి తన సొంత ఖర్చుతో బావి తవ్వి వ్యవసాయం ప్రారంభించాడు. ఈ నీటిని ఉత్తందన్ వినియోగించుకోకూడదని పళనిస్వామి చెప్పగా, ఇద్దరి మధ్య శత్రుత్వం పెరిగింది. ఈ నేపథ్యంలో 2024 ఆగస్టు 7వ తేది పళనిస్వామి వ్యవసాయం చేస్తుండగా, అక్కడకు చేరుకున్న ఉత్తందన్, అతడి భార్య రాజామణి (65), కుమారుడు అళగేశన్ (45) నీరివ్వాలని పళనిస్వామిని కోరడంతో, వారి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఉత్తందన్, అళగేశన్ కత్తులతో పళనిస్వామిపై దాడిచేయగా, రాజామణి కర్రతో కొట్టింది. ఈ ఘటనలో పళనిస్వామి మృతిచెందాడు. ఈ వ్యవహారంపై ముసిరి పోలీసులు కేసు నమోదుచేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ముగిసి, నేరారోపణ రుజువుకావడంతో, ఉత్తందన్, రాజామణి, అళగేశన్‌లకు జీవిత ఖైదు,తలా రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి క్రిస్టోఫర్ తీర్పు వెలువరించారు.

కరూర్ ఘటనపై సీబీఐ విచారణకు డిమాండ్

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా వేలుస్వామిపురంలో శనివారం టీవీకే రోడ్‌షోలో సంభవించిన తొక్కిసలాటలో 39 మంది మృతిచెందిన వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) సహా పలు పార్టీల నేతలు డిమాండ్ చేశారు. కరూర్ ప్రాంతంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిని సీఎం స్టాలిన్, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి, ఓపీఎస్, టీఎంసీ అధ్యక్షుడు జీకే.వాసన్, సీపీఎం మాజీ రాష్ట్రకార్యదర్శి కె.బాలకృష్ణన్ తదితరులు పరామర్శించారు. ఈ నేపథ్యంలో ఓపీఎస్, జీకే.వాసన్, బాలకృష్ణన్ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శనివారం కరూర్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన మళ్లీ తలెత్తకుండా ప్రభుత్వం రాజకీయ పార్టీల ప్రచార సభలకు పోలీసు భద్రత పెంచాలని, రద్దీ ప్రాంతాల్లో ప్రతిపక్ష నేతల సభలకు తగిన భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

విజయ్ నివాసం ముట్టడియత్నం

50 మంది అరెస్ట్ ● అదనపు పోలీసు భద్రత



నీలాంగరైలోని విజయ్ నివాసానికి వెళ్లే దారిలో పోలీసులు ఏర్పాటు చేస్తున్న బారికేడ్

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో శనివారం రాత్రి దుర్ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ డీఎంకే విద్యార్థి విభాగం ఆదివారం ఉదయం నీలాంగరైలోని విజయ్ నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఆ సందర్భంగా పోలీసులు 50 మందిని అరెస్ట్ చేశారు. విజయ్ నివాసం వద్ద ఇప్పటికే ఒక సీఐ నేతృత్వంలో 15 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేయగా, మరోవైపు కేంద్రప్రభుత్వం ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పించింది. కరూర్ విషాద ఘటన అనంతరం శనివారం రాత్రి నుంచే విజయ్ నివసిస్తున్న పాంతంలో పోలీసులు భద్రతను పెంచారు. ఆదివారం ఉదయం రోడ్లకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

మినీ బస్సు పథకం పిటిషన్ తోసివేత

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటివరకు రవాణా సదుపాయం లేని గ్రామాలకు కొత్తగా మినీ బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని వ్యతిరేకిస్తూ ప్రైవేటు బస్సు ఆపరేటర్ల తరుపున దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం మినీ బస్సు పథకాన్ని ప్రవేశపెట్టేందుకు ముందుకొచ్చింది. అయితే ఈ పథకం వల్ల తాము నష్టపోయే అవకాశముందంటూ ప్రైవేటు బస్సు ఆపరేటర్ల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. శుక్రవారం ఈ కేసు న్యాయమూర్తి ఎన్.మాల ముందుకు విచారణకు వచ్చింది. గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ ప్రకటించిన మినీ బస్సు పథకాన్ని వ్యతిరేకించడం సరికాదన్న న్యాయమూర్తి వ్యతిరేక పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఉత్తర్వు జారీచేశారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని బెదిరించి సెల్‌ఫోన్ చోరీచేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వ్యాసర్పాడి పుదునగర్ ప్రాంతానికి చెంది జలాల్, సెల్‌ఫోన్ సర్వీస్ సెంటర్ నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి జలాల్ కుమార్తెతో కలసి బైక్‌పై వెళ్తుండగా, ఇద్దరు వ్యక్తులు బైక్ అడ్డుకుని జలాల్‌ను తోసివేసి, అతడి సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఎంకేబీ నగర్ పోలీసులు, వ్యాసర్పాడి ముల్లైనగర్‌కు చెందిన కార్తీక్ అలియాస్ కిన్రకరుప్పు కార్తీ, జగన్ లను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

హత్యకేసులో బాలుడి సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్యకేసులో బాలుడి సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... మెహతా నగర్ వంతెన కింద కూవం నదిలో ఓ యువకుడి మృతదేహం ఉన్నట్లు చెట్‌పెట్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, విచారణ చేపట్టాగా మృతుడు సాయినాథ్ (24) అని, అతడిపై పలు కేసులు నమోదైనట్లు గుర్తించి ఈ కేసులో షేనాయ్ నగర్‌కు చెందిన అన్బరసన్ (18), భరత్ (20), ఓ మైనర్ బాలుడిని అరెస్ట్ చేశారు. విచారణలో... సాయినాథ్ ప్రేమిస్తున్న యువతి సోదరుడైన అన్బరసన్ ఈ విషయమై సాయినాథ్‌ను మందలించినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం అన్బరసన్ తన స్నేహితులతో కలసి సాయినాథ్‌ను కత్తితో బెదిరించి, శుక్రవారం రాత్రి సాయినాథ్‌ను పథకం ప్రకారం హతమార్చి కూవం నదిలో పడేశారని తెలిసింది. ఈ కేసులో అన్బరసన్, భరత్, బాలుడిని ఆదివారం కోర్టులో హాజరుపరచి, ఇద్దరి జైలుకు, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

మహిళలపై వీధి కుక్కల దాడి

పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో వీధి కుక్కల దాడిలో మహిళకు గాయాలయ్యాయి. సరస్వతి అనే మహిళ శనివారం మధ్యాహ్నం కొడైకెనాల్‌లోని రోడ్డులో నడిచి వెళ్తుండగా వీధి కుక్కలు ఆమెపై దాడి చేశాయి. సరస్వతి కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని కుక్కలను తరిమివేశారు. అనంతరం గాయపడిన ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొడైకెనాల్‌లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వీరి నుంచి ప్రజలను రక్షించేలా స్థానిక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా బొరుగుల తయారీ



పెరంబూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజ సమీపిస్తున్న తరుణంలో, రాష్ట్రవ్యాప్తంగా బొరుగుల తయారీ ఊపందుకుంది. అక్టోబరు 1వ తేది ఆయుధ పూజ సందర్భంగా పుదుకోట సహా పలు ప్రాంతాల్లో బొరుగుల తయారీ ఊపందుకుంది. ఆరు కిలోల బొరుగుల బస్తా ధర రూ.30 వరకు పెరిగి రూ.420కి విక్రయిస్తున్నారు. పండుగకు ఇంకా మూడు రోజులే ఉన్న నేపథ్యంలో, బొరుగుల ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తాంబరం-చెంగల్పట్టు మధ్య

నాలుగో రైలుమార్గం

● రూ.713 కోట్లతో నిర్మాణానికి సన్నాహాలు



ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు పెరిగిన ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ రైల్వే అదనపు మార్గాల నిర్మాణానికి పూనుకుంది. ఇందులో భాగంగా తాంబరం - చెంగల్పట్టు మధ్య రూ.713 కోట్లతో 31 కి.మీ మేర నాలుగో రైలు మార్గాన్ని నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసిన అధికారులు రైల్వే బోర్డు అనుమతి కోసం పంపించారు. రైల్వే బోర్డు ప్రణాళిక అంచనా కమిటీ సభ్యులు ఈ ప్రాజెక్టు కోసం సేకరించే భూములకు ఇవ్వాల్సిన ఖర్చు అదాచేసేలా కొత్త రైలు మార్గం పరిశీలన పూర్తిచేసి సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నాలుగో రైలుమార్గం అందుబాటులోకి వస్తే 140 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడపవచ్చు. ప్రస్తుతం ఉన్న రైలు మార్గాల్లో 110 కిలోమీటర్ల వేగంతో మాత్రమే నడుపుతున్నారు. రైల్వేబోర్డు నుండి అనుమతులు పొందాక తాంబరం-చెంగల్పట్టు మధ్య కొత్త రైలు మార్గం నిర్మాణం పనులను ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.

ఐఎన్ఏ అధికారిగా శశికుమార్



ధరణి రాజేంద్రన్ - శశికుమార్

'యాద్దిసై' వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కిస్తున్న డైరెక్టర్ ధరణి రాజేంద్రన్ రూపొందించే తదుపరి చిత్రంలో సీనియర్ నటుడు శశికుమార్ ఐఎన్ఏ అధికారి పాత్ర పోషిస్తున్నారు. ఈ విషయాన్ని ఆదివారం శశికుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని అధికారికంగా వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వివరాలను దర్శకుడు ధరణి రాజేంద్రన్ వివరిస్తూ, 'మా సినిమాలో నటించేందుకు శశికుమార్ అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉంది. బ్రిటిష్ పాలన నేపథ్యంలో ఈ చిత్రం కొనసాగుతుంది. ఇందులో శశికుమార్ ఐఎన్ఏ పాత్ర పోషిస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. ఐఎన్ఏ పాత్రకు శశికుమార్ కాకుండా ఇతర నటులను ఊహించలేకపోయాం. 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి విజయంతమైన చిత్రంలో నటించిన శశికుమార్ వెంటనే ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించడం మాకే ఆశ్చర్యం కలిగించింది. ఇప్పటికే 70 శాతం షూటింగ్ పూర్తి చేశాం. మిగిలిన చిత్రీకరణతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల చేసేందుకు ప్రయత్నిస్తాం' అని వెల్లడించారు. జేకే ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. ఇతర పాత్రల్లో సేయోన్, భవానీ శ్రీ, సముద్రఖని, షివదా, కిషోర్ తదితరులు నటించారు.

రజనీకాంత్‌తో కలిసి నటిస్తా : కమల్

తన స్నేహితుడు కమల్ హాసన్‌తో కలిసి సినిమాలో నటిస్తానని అగ్ర నటుడు, రాజ్యసభ సభ్యుడు, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, 'నేను, రజనీకాంత్‌తో కలిసి ఒక చిత్రంలో నటిస్తాను. ఖచ్చితంగా మా ఇద్దరి కాంబినేషన్‌లో ఒక మూవీ ఉంటుంది. గతంలో మేమిద్దరం కలిసి పలు చిత్రాల్లో నటించాం. మళ్ళీ నటించాలని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, ఇటీవల రజనీకాంత్ కూడా 'సరైన కథ కుదిరితే కమల్‌తో కలిసి నటిస్తానని ప్రకటించిన విషయం తెల్సిందే. అలాగే, ఈ ఇద్దరు అగ్రహీరోలను యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేయనున్నారనే చర్చ కోలీవుడ్‌లో సాగుతోంది.

కమల్ హాసన్, రజనీకాంత్ ←



హిజ్రాలు గర్వపడే చిత్రం 'శరీరం'

హిజ్రాలు గర్వపడేలా రూపొందించిన చిత్రం 'శరీరం'. తమ ప్రేమను నెగ్గించుకోవడం కోసం ప్రేమజంట లింగమార్పిడి చేసుకోవడం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలతో ఈ సినిమా రూపొందించారు. జీవీ పెరుమాళ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోగా దర్శన్ ప్రియన్ అనే యువకుడు పరిచయంకాగా,హీరోయిన్‌గా చార్మి విజయలక్ష్మి నటించారు.క్రూరమైన పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో జీవీ పెరుమాళ్ నటించి ప్రేక్షకులను మెప్పించడంతో



'శరీరం'లో దర్శన్, చార్మి

చిత్రజ్యోతి

పాటు సినిమా సొంతంగా నిర్మించారు. అందుకే ఆయన ధైర్యాన్ని అనేక మంది సినీ ప్రముఖులు అభినందిస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఇలాంటి కథను ఎంచుకోవాలంటే ధైర్యం కావాలని వారు అంటున్నారు. సమాజంలో హిజ్రాలు గర్వపడేలా దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించారని అభిప్రాయపడుతున్నారు. 'ఇసైజ్ఞాని' ఇళయరాజాను మార్గదర్శకంగా తీసుకుని మ్యూజిక్ డైరెక్టర్ భారతీరాజా సంగీతం సమకూర్చి సినిమాకు ప్రాణం పోశారని మేకర్స్ పేర్కొన్నారు. ఈ సినిమాలో సీనియర్ నటి షకీలా లింగమార్పిడి చేసే వైద్యురాలి పాత్రలో మెప్పించారు.దర్శకుడు జీవీ పెరుమాళ్ ఒక మంచి ఆలోచనతో ఈ సినిమాను తీశారని,ఆయనను ప్రతి ఒక్కరూ మెచ్చుకుని అభినందించాలని పలువురు సినీ ప్రముఖులు పేర్కొంటున్నారు.

హింస.. మానవత్వాన్ని నాశనం చేస్తుంది

- నివేదా పేతురాజ్



సమాజంలో జరుగుతున్న హింసాత్మక చర్యలు మనుషుల్లోని మానవత్వాన్ని నాశనం చేస్తుందని హీరోయిన్ నివేదా పేతురాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మదురైలో పుట్టిన ఈ భామ.. దుబాయ్‌లో పెరిగారు. అక్కడే విద్యాభ్యాసం చేసి, మోడల్‌గా గుర్తింపు పొందారు. 'ఒరు నాల్ కూత్తు' అనే సినిమా ద్వారా తమిళ వెండి తెరకు పరిచయమై ఆ తర్వాత 'ఎన్ మనసు తంగం', 'టిక్ టిక్ టిక్', 'తిమిరి పుడిచ్చవన్' తదితర చిత్రాల్లో నటించారు. అలాగే, కొన్ని తెలుగు చిత్రాల్లో కూడా కనిపించారు. దుబాయ్‌కు చెందిన రజిత్ ఇబ్రాన్‌ను వివాహం చేసుకున్నారు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే నివేదా.. తాజాగా సమాజంలో పెరిగిపోతున్న హింసపై తన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఇపుడు ఏ టీవీ చానెల్ ఆన్ చేసినా, వెబ్ సైట్‌కు వెళ్ళినా, పేపర్‌లో చూసినా హత్య, యుద్ధం, క్రూరత్వానికి సంబంధించిన వార్తలు మాత్రమే కనిపిస్తున్నాయి. వాటికోసం మనం శోధించకపోయినా ప్రతి రోజూ అవి మనకు కనిపిస్తూనే ఉన్నాయి. ఈ హింస మనలోని మానవత్వాన్ని నాశనం చేస్తోంది. ప్రపంచంలో జరిగే సమాచారాన్ని తెలుసుకునేందుకు మరో మార్గం మనకు అవసరమని ఈ చర్యలు చేబుతున్నాయి' అని ఆమె పేర్కొన్నారు.

నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు



రక్తదానం చేసిన డీవీ.శ్రీనివాస్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న మంత్రి పీకే.శేఖర్‌బాబు, చెన్నై తెలంగాణ సంఘ నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుక జరుపుకోనున్నారు. రాజధాని నగరంలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు ప్రతిఏటా తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతూ బోనాలు, బతుకమ్మ వేడుకలను కోలాహలంగా జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూలై 26న బోనాల జాతర, 21న ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు జరిగాయి.. సోమవారం సాయంత్రం 5 నుండి రాత్రి 9 గంటల వరకు షావుకారుపేట అమ్మన్‌కోవిల్‌వీధిలో ఉన్న జీఎస్‌టీటీ పాఠశాలలో సద్దుల బతుకమ్మ వేడకలు నిర్వహించనున్నట్లు తెలంగాణ కుల సంఘాల తరుపున సంఘ అధ్యక్షుడు ఎం.పరుశురాములు తదితరులు ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో, సంఘం సీనియర్ సభ్యులు డీవీ.శ్రీనివాస్ 52సార్లు రక్తదానం చేసిన సందర్భంగా సంఘం తరుపున మంత్రి పీకే.శేఖర్‌బాబు చేతుల మీదుగా ఆయనకు జ్ఞాపిక అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

నేత్రపర్వంగా నవకన్య పూజ

- 2న ఆర్యపాక్కంలో అక్షరాభ్యాసం



నవకన్య పూజలో మణిమాలారావు, కళాకారులు

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కం గ్రామంలోని విద్యారంభ జ్ఞాన సరస్వతి ఆలయంలో నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని శనివారం సుమంగళి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ మహామండపంలో అమ్మవారు ధైర్యలక్ష్మీ. అలంకారంలో దర్శనమిచ్చారు. సంగీత, నృత్య కళాకారులు గోమతి శంకర్, దోషికాశ్రీలను ఆలయ నిర్వాహకులు మణిమాలారావు సత్కరించారు. అనంతరం రెండేళ్ల నుండి పదేళలోపున్న 9 మంది బాలికలను నూతన వస్త్రాలు, నగలు, గాజులు, పూలమాలలతో సుందరంగా అలంకరించి నవకన్య పూజ చేశారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు గురుస్వామి భక్తవత్సలం, ధర్మకర్త పీవీ.కృష్ణారావు పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అక్టోబర్ 2న సరస్వతి అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం జరుగుతుందని, బడిలో పిల్లలను చేర్పించాలనకునేవారు పెద్దసంఖ్యలో హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

అక్షయబాబా మందిరంలో...



కన్యపూజలో ముత్తైదువులు, భక్తులు

స్థానిక బ్రాడ్‌వే ఆచారప్పవీధిలోని అక్షయబాబా మందిరంలో నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి ఈ నెల 22 నుంచి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన నవకన్యపూజలో బాలికలను అమ్మవారి స్వరూపంగా భావించి కన్యపూజ నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు అన్నప్రసాదాలు, చిన్నారులకు నూతన వస్త్రాలు, ముత్తైదువులకు పసుపు, కుంకుమలు పంపిణీ చేశారు.



టి.నగర్‌లో తెలుగు బ్రాహ్మణ మహాసభ మాజీ అధ్యక్షులు కల్య రఘుకుమార్, లక్ష్మి దంపతుల నివాసం 'సుఖాలయం'లో నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో

అలరించిన వైష్ణవి గానామృతం

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ గాంధీనగర్ రామచంద్ర ఆదిత్యనార్ రోడ్డులో ఉన్న ప్రకృతి ఉమ్మిడి జ్యూవెలర్స్ కార్యాలయంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రకృతి సంగీత మేళా శ్రోతలను అలరిస్తోంది. గాయని వైష్ణవి వెంకట్ శనివారం రాత్రి తమ బృందంతో అమ్మవారిని కీర్తిస్తూ శ్రావ్యంగా కీర్తనలు ఆలపించారు. ఎంకే అనంతలక్ష్మి (వయోలిన్), కార్తిక్ (మృదంగం)తో వాద్యసహకారమందించారు. వీరిని తిరువళ్లూరు జిల్లా కాకలూరు మారుతీటౌన్‌లోని సెల్వగణపతి దేవాలయం, రామాలయ స్థాపకులు ఊరా శ్రీమన్నారాయణ-సరళ దంపతులు, ఉమ్మిడి బంగారు ప్రకృతి షోరూమ్ అధినేతలు ప్రశాంత్-కల్పన దంపతులు శ్రీవారి లడ్డూ ప్రసాదం అందజేసి బహుమతులతో ఘనంగా సత్కరించారు.



కళాకారులతో ఊరా శ్రీమన్నారాయణ, ఉమ్మిడి ప్రశాంత్ దంపతులు

కవుల జీవితం పరుగు పందెంలాంటిదే

- జాషువా జయంతి సభలో అనిల్‌కుమార్ రెడ్డి

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): సమాజానికి కనువిప్పు కలిగించే మనోనేత్రం కలిగిన కవుల జీవితం పరుగుపందెంలాంటిదని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు, పారిశ్రామికవేత్త కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి అభివర్ణించారు. స్మారక భవనంలో ఆదివారం ఉదయం 'జనని సమితి' ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు డా.నిర్మలా పళనివేలు సభాధ్యక్షురాలిగా వ్యవహరించి అతిథులు, సాహితీవేత్తలతో కలిసి గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్‌రెడ్డి తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన 'ఉగ్గుపాల నుండే' అనే కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా రచనలు నేటికి మన్నన పొందుతున్నాయని, ఆయన అభ్యుదయ కవితా పితామహుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తిరుపతి జిల్లా అరసం కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న సమీక్షిస్తూ పేరూరు బాలసుబ్రమణ్యం రైతు జీవన స్థితిగతులను, సామాజిక పరిస్థితులను తన కవితా వస్తువులుగా తీసుకుని ఉగ్గుపాలనుండే... కవితా సంపుటి తీసుకురావడం సంతోషదాయకమన్నారు. రచయిత బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, తాను అనుభవించిన జీవితాన్ని కవితల రూపంలో తీసుకొస్తున్నానని, జనని సంస్థ తన పుస్తక పరిచయ సభను నిర్వహించడం సంతోషకరమన్నారు. విశిష్ట అతిథిగా మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు, ఆత్మీయ అతిథిగా తిరుపతి జిల్లా అరసం అధ్యక్షుడు యువశ్రీ మురళి, ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ కాసల నాగభూషణం, ఎల్బీశంకరరావు, ప్రముఖ గాయకుడు కిడాంబి లక్ష్మీకాంత్, కూనూరు మాధవరావు, నెడమర్తి వసుంధరదేవి తదితరులు పాల్గొన్న, ఈ సభలో జనని ఉపాధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు డా.మన్నవ గంగాధర ప్రసాద్ స్వాగతం పలుకగా, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య వందన సమర్పణ చేశారు.



ఉగ్గుపాలనుండే పుస్తక పరిచయ సభలో అనిల్‌కుమార్ రెడ్డి, నిర్మలా పళనివేలు, విస్తాలి శంకరరావు, గంగాధర ప్రసాద్, బాలసుబ్రమణ్యం తదితరులు

విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న ప్రజలు
- ఆందోళన చెందవద్దన్న వైద్యులు

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వేగంగా విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, నగరవాసులు పరిశుభ్రత పాటించాలని, ఈ జ్వరాలపై ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వైద్యులు సూచించారు. జీసీసీ పరిధిలో ఉన్న 200వార్డుల్లో నివసిస్తున్న ప్రజల్లో రోజుకు వెయ్యిమందికి పైగా జ్వరాలతో బాధపడుతూ చికిత్సకోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ, ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన కలిగిన మార్పుల కారణంగా విషజ్వరాల తీవ్రత పెరుగుతోందని, ఇందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న పలువురు చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్తున్నారని, ఎవ్వరూ కూడా అడ్మిషన్ అయిన దాఖలాలు లేవన్నారు. వైరల్ జ్వరాలు సోకి



దగ్గు, జలుబుతో బాధపడుతున్నవారు సుమారు నాలుగు రోజుల వరకు వేడినీరు, మందులను వాడాలని తెలిపారు. అదేవిధంగా ఎగ్మూర్ ప్రభుత్వ చిన్నారుల సంక్షేమ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ... అక్టోబర్, నవంబర్ నెలల్లో విషజ్వరాలు వ్యాపించడం సహజమేనని, ఈ జ్వరాలు సోకి తమ ఆస్పత్రికి ప్రతి రోజూ 1,500 మందికి పైగా పిల్లలు అవుట్ పేషంట్లుగా వచ్చి చికిత్స పొందివెళుతున్నారని తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే జ్వరాలకు భయపడాల్సిన అవసరం లేదని, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోకి జ్వరపీడితులు వెళ్లరాదని, ప్రతి ఒక్కరు శుభ్రతపై దృష్టిసారించాలని, నీటిశాతం అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మంచిదని ఆమె సూచించారు.



వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో 'మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం' అనే అంశంపై ప్రసంగించిన వక్త, వివేకానంద కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు డాక్టర్ కళ్లే ప్రశాంత్‌ను సత్కరిస్తున్న వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు.

కరూర్‌లో విచారణ ప్రారంభించిన జస్టిస్ అరుణా జగదీశన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారివద్ద విచారణ జరుపుతున్న జస్టిస్ అరుణా జగదీశన్

ప్యారీస్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట ఘటనలో 40 మంది మృతిచెందిన కేసులో జస్టిస్ అరుణా జగదీష్ ఆదివారం విచారణ ప్రారంభించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తూత్తుకుడిలో స్టెరిలైట్ కాపర్ కర్మాగారానికి వ్యతిరేకంగా ధర్నాలో పాల్గొన్న ఆందోళనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో పలువురు మృతిచెందారు. ఈ కేసు విచారణను సమర్థవంతంగా జస్టిస్ అరుణా జగదీష్ పూర్తిచేయడం గమనార్హం. న్యాయశాఖలో విశేష అనుభవం కలిగి మద్రాస్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి పదవీవిరమణ పొందారు. ఈ నేపథ్యంలో, కరూర్ ఘటనపై కేంద్రప్రభుత్వం సమగ్ర వివరాలతో నివేదిక కోరింది. దీనికి సంబంధించి జస్టిస్ అరుణా జగదీష్ నేతృత్వంలో శనివారం రాత్రే సీఎం స్టాలిన్ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులతో జస్టిస్ అరుణా జగదీష్ ఆదివారం కరూర్ చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులు పలువురి వద్ద విచారణలు జరిపినట్లు సమాచారం. ఇదిలా వుండగా, 36 మంది మృతులను గుర్తించి వారిభౌతికదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కరూర్ ప్రభుత్వాసుపత్రి డీన్ శాంతి తెలిపారు. జస్టిస్ అరుణా జగదీష్‌తో కలిసి క్షతగాత్రులను పరామర్శించిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, పోసుమార్టంకు మాత్రమే 16 మంది వైద్యులను నియమించినట్లు తెలిపారు. శనివారం రాత్రి నుంచి ఈరోడ్, మదురై జిల్లాల వైద్య నిపుణులు అని మొత్తం 70 మందికి పైగా సేవలందిస్తున్నారని తెలిపారు. కరూర్ ప్రైవేటు ఆస్పత్రిలో 31 మంది చికిత్సలు పొందుతున్నారని ఆమె తెలిపారు.

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో శనివారం రాత్రి వరి, మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు రవి మామిడితోటలోకి ప్రవేశించి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి నాయనిచెరువు వద్దకు వెళుతూ మార్గంలోని పెద్ద బండవద్ద కలబందలను తినేశాయి. నాయనిచెరువు కట్ట కిందకు చేరుకున్న ఏనుగులు రైతులు సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరిపంటను తినేసి ఇష్టానుసారంగా తొక్కేశాయి. చిన్ననగరి కృష్ణమూర్తికి చెందిన పశుగ్రాసంను తినేసిన అనంతరం దిగుమూరివారిపల్లి వద్దకు చేరుకొని గురుస్వామి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. ఆదివారం పగలంతా ఏనుగుల గుంపు అడవిలోని చాకలోని కోన వద్ద తిష్ట వేశాయి. అటవీ సరిహద్దులో ఉన్న దేవళంపేట, పాళెం, కమ్మపల్లి పంచాయతీ ప్రజలు ఏనుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్ద బసచేయరాదని మంగళంపేట ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

రామేశ్వరంలో 108 అడుగుల హనుమాన్ విగ్రహం

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం రామేశ్వరంలో ఉత్తరాదికి చెందిన ఓ ట్రస్టు రూ.100 కోట్లతో 108 అడుగుల ఆంజనేయుడి విగ్రహం నిర్మిస్తున్నారు.. గత రెండేళ్లుగా ఈ విగ్రహ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ విగ్రహం కోసం ఎత్తయిన పీఠం నిర్మించి, దానిపై ఆంజనేయుడి విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటివరకూ పాదాల నుండి కంఠం ద్వారా విగ్రహ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని ఈ పనులను పరిశీలిస్తున్న ఇంజనీర్ శ్రీధర్ తెలిపారు. ఉత్తరాదికి చెందిన ట్రస్టు దేశంలో నాలుగు ప్రముఖ నగరాల్లో 108 అడుగుల ఎత్తైన అంజనేయుడి విగ్రహాలను నిర్మించాలని సంకల్పించిందని, ఆ ప్రకారం గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్, సిమ్లాలోను ఏర్పాటు చేసిన విగ్రహాలను ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం రామేశ్వరంలో విగ్రహం నిర్మాణ పనులు నాలుగు నెలలో పూర్తవుతాయన్నారు. ఆ తర్వాత అస్సోమ్‌లోనూ 108 అడుగుల ఆంజనేయుడి విగ్రహాన్ని నిర్మించనున్నామని ఆయన వివరించారు.

నిర్మాణంలో ఉన్న భారీ విగ్రహం



